# సత్యవాక్యము

# THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న 'సత్యవాణి' యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలుపొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ 10/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి !!

**SATYA VANI**
**(P.O. Box 80) Seshagiri Rao St.**
**KAKINADA–533 004**

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం !!

రాజన్ ఎలక్ట్రిక్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

పోస్ట్ బాక్స్ - **80,** కాకినాడ - **533 001**

ఎడిటర్ : జె. సి. ఛోట్

మేనేజింగ్ ఎడిటర్ : జాషువా గూటం

సంచిక **2** సెప్టెంబరు **1984** సంపుటి **5**


# సంపాదకీయము

## క్రమ పద్ధతిలో నడిపింపబడుండి

*( Get Organized )*

ఏ వ్యవస్థయైనా సమర్ధవంతముగా పనిచేయాలన్నా, దాని ధ్యేయాన్ని సాధించుకోవాలన్నా, అది సరిగా ఆర్గనైజు చేయబడాలి. వ్యాపారము, విద్య, మరే యితర రంగములలోనైనా యిలాగే జరగాలి. మత విషయములో కూడ అంతే. క్రీస్తు తన సంఘాన్ని నిర్మించుటలో దీన్ని వ్యక్తం చేసాడు. ఆయన శిరస్సైయున్నను (ఎఫెసీ 5:23; కొలస్స 1:18), ఆ సంఘమందలి ప్రతి స్థానిక సంఘము స్థానికముగా నాయకత్వమును వహించుటకు స్వంత పెద్దలతోను పరిచారకులతోను స్వతంత్ర ప్రతిపత్తిని కల్గియుండునట్లు ఆయన దానిని ఏర్పాటు చేసాడు. పరిచర్య చేయుటకు పెద్దలుగను, పరిచారకులుగను నియమింపబడే వారికి నిర్ణీతమైన యోగ్యతలుండుట అవశ్యకం (1 తిమోతి 3; తీతు 1). వారు నియమింపబడితే, సంఘము ఆధ్యాత్మికముగా అభివృద్ధి నొందునట్లు, సభ్యులకు ఆధ్యాత్మిక ఆహారము అందించునట్లు

తప్పును ఖండించునట్లు, బలహీనులను బలపరచునట్లు, అవుసరములలో యున్న వారిని ఆదుకొనునట్లు, అవిశ్వాసులను క్రమశిక్షణలో పెట్టునట్లు వారు బాధ్యత వహించాలి. సంఘము తన స్వంత అవుసరములను మాత్రమేగాక నశించుచున్న వారికి అత్యావశ్యకముగా సువార్తను అందించాలి. పెద్దలకు సహకరిస్తూ, తమ పనులను సక్రమంగా నిర్వర్తించుటయే పరిచారకుల యొక్క ముఖ్య విధి. సంఘాన్ని ఏ ఒక్కడు నియంతగా పాలింప వీలులేదు. గాని ప్రతి స్థానిక సంఘములో తగిన అర్హతలుగల యిద్దరు లేక అంతకంటె ఎక్కువమంది పురుషులు పెద్దలుగా నియమింపబడాలి యని లేఖనములు బోధిస్తున్నాయి. పరిచారకుల నియామకం కూడా అలాగే జరగాలి. పెద్దలు సభ్యులను వెనుకనుండి తోలేవారుగా కాదుగాని ముందుండి నడిపించేవారై యుండాలని లేఖనములు చెప్పుచున్నాయి. పేతురు ఇట్లు వ్రాసాడు: "తోటి పెద్దను, క్రీస్తు శ్రమలను గూర్చిన సాక్షిని, బయలుపరచబడబోవు మహిమలో పాలివాడనైన నేను మీలోని పెద్దలను హెచ్చరించుచున్నాను. బలిమిచేతకాక దేవుని చిత్తప్రకారము ఇష్టపూర్వకముగాను, దుర్లాభాపేక్షతో కాక సిద్ధమనస్సుతోను, మీ మధ్యనున్న దేవుని మందను పైవిచారణచేయుచు దానిని కాయుడి. మీకు అప్పగింపబడినవారిపైన ప్రభువులైనట్టుండక మందకు మాదిరులుగా ఉండుడి. ప్రధానకాపరి ప్రత్యక్షమైనప్పుడు మీరు వాడబారని మహిమ కిరీటము పొందుదురు" (1 పేతురు 5:1-4).

బాల్యావస్థలోను లేక తక్కువమంది సభ్యులతోను, పురుషుల్లో ఎవరూ పెద్దలుగా పరిచారకులుగా నియమింపబడుటకు యోగ్యులైన వారు లేని సంఘము లున్నట్లయితే, వాటి సంగతి ఏమిటి? అలాంటి సంఘములు పెద్దలను, పరిచారకులను కలిగియుండ లేరు. అంతమాత్రమే కాదుగాని, తగినయోగ్యతలు లేనివారిని ఆపదవులకు నియమించేకంటే పెద్దలు లేకుండానే పనిచేయడం శ్రేయస్కరం. ఎందుకంటే ఆయో

గ్యులు తమ హోదాలను దుర్వినియోగపరచి దూషణ పాలౌతారు. యోగ్యులైన పెద్దలు పరిచారకులు లేకపోవడంకన్నా, అయోగ్యులు ఈ హోదాల్లో నియమింపబడడం హానికరం. ఏసంఘములోనైనా పెద్దలు పరిచారకులు నియమింపబడటం వీలుకాకపోతే, దాని కృషికి సంఘమందలి పురుషులే నాయకత్వం చేపట్టాలి. అట్టి పరిస్థితులలో-తమ యొక్క అవసరాన్ని గూర్చి, పనులను గూర్చి, ఎవరు ప్రసంగించాలో, ఎవరు బోధించాలో, ఎవరు కోశాధికారిగా యుండాలో మున్నగు విషయాల్ని చర్చించుకొనుటకుగాను వారు తరచు సమావేశ మవ్వాలి. ఇలాంటి కూటములను కార్య నిర్దేశక కూటములు (Business meetings) అంటారు. ప్రతివారము ప్రభువు బల్లను నిర్వహించుటకు, ఎప్పుడు ఎవరు ప్రార్థనలు చేయాలో చూచుకొనుటకు ఒకరిద్దరు బాధ్యత వహించాలి. బోధింప సమర్థులైన వారిని ఆయా తరగతులలో ఉపదేశింపమని చెప్పుటకు, బోధనా కార్యక్రమమును పర్యవేక్షించుటకు ఒకరిద్దరు ఉండాలి. కొన్నిసార్లు వీటినే కమిటీలు అంటారు. ఇలాంటి విషయాల్ని అందరు చూసేకంటే లేక చివరి క్షణములో ఎవరో చేసేకంటే, లేక ఎవరు చేయకుండా ఉండేకంటే, లేక అస్తవ్యస్తంగా జరిగేకంటే, ప్రత్యేకమైన పనులకు కొందరిని నియమించడం మంచిది. అవసరములను, అనుకూలతను బట్టి యితర పనుల నిర్వహణకై కమిటీలను ఏర్పరచాలి.

సంఘము ఎంత చిన్నదైనా అది ఎప్పుడు సమావేశము కావాలో, ఎప్పుడు ఏ కూటము ఆరంభమౌతాదో, ఆ సమావేశ వేళలను నిర్ణయించాలి. ఒకసారి నిశ్చయించిన పిమ్మట, అందరు దాని ప్రకారం చేయాలి. ఇలాగ జరుగకపోతే, సంఘమునకు ఒక క్రమమైన పద్ధతి లేదని, తమ పని విషయమై పట్టింపు లేకుండా యున్నారని సభ్యులు, మరి ముఖ్యముగా విజిటర్లు అనుకొంటారు. తత్ఫలితముగా పని దెబ్బతింటుంది. నాయకులు యిలాంటి విషయాల్లో

నిష్కర్షగా లేనట్లయితే, సభ్యులు పరిచర్య చేసేవారియందు నమ్మ
కాన్ని కోల్పోతారు.

గనుక సరిగా ఆర్గనైజు చేయబడుట అవశ్యకం. దీనిలో సంఘ
మందలి సమ్మతమైన పురుషులందరు వినియోగింపబడాలి. ప్రభురాత్రి
భోజనమును సిద్ధము చేయుటలో రొట్టె, ద్రాక్షారసమును తయారు
చేయుటలోను, పిల్లల తరగతులలో ఉపదేశించుటలోను, సంఘ
మందలి స్త్రీలకు ఉపదేశించుటలోను, వ్యక్తిగత సేవద్వారా తోడ్ప
డుటలోను, విజిటర్లకు ఆతిథ్య మిచ్చుటలోను, యింకా యిలాంటి
విషయాల్లో స్త్రీలను సహాకరించమని అడగాలి.

సువార్తను ప్రకటించుట సంఘముయొక్క ముఖ్య కర్తవ్యము
గనుక సువార్త కూటము నిర్వహించుటకు, సభ్యులను బోధించే సమర్థు
లుగా చేయుటకు ప్రత్యేక తరగతుల ద్వారా శిక్షణ నిచ్చుటకు,
ఫిల్ములు ప్రదర్శించుటకు, రోగులను అవసరాల్లో యున్నవారిని పరా
మర్శించుటకు, సభ్యులను అవిశ్వాసులను దర్శించుటకు, స్థానిక ప్రాంత
ములో వ్యక్తిగత సేవ చేయుటకు, పట్టణమందలి యితరచోట్ల వెలు
పటి ప్రాంతాల్లోను కూటములు ఏర్పాటు చేయుటకు, సువార్త ప్రక
టనకు కావలసిన అవసరాల్ని తీర్చుటకు నాయకులు ఒక పధకాన్ని
వేసుకోవాలి. సంఘము కూడుకొనుటకు ఒక స్వంత భవనాన్ని
నిర్మించుకొనటానికి, పెద్దలు పరిచారకులు నియమింపబడునట్లు
ప్లాను వేసుకోకుండా ఎందుకుండాలి! ఒకరిని లేక ఎక్కువమంది
పురుషులకు పూర్తిగా సపోర్టు చేసే స్తోమతను సంఘము పొందునట్లు
ఆలోచించి, కృషిచేయాలి.

స్థానికముగను, ప్రపంచవ్యాప్తముగను సంఘము నిర్వర్తింప
వలసిన ఒక గొప్ప పని యున్నది. సమయము ప్రాముఖ్యమైనది.
నాలుగు లక్షల కోట్లకంటె ఎక్కువమందికి సువార్త నందింపవలసి
యున్నది. దాన్ని నెరవేర్చగల్గుటకు మనమేమి చేయబోవుచున్నాము!

మనకు విశ్వాసము, దీక్ష, సాహసము, నిశ్చయత కావాలి. శక్యమై నంత సాధించుటకు క్రైస్తవులమైన మనము కలసికట్టుగా కృషిచేయ గలం. గనుక మనము క్రమముగా నడిపింపబడాలి. ఒకరినొకరు ప్రేమించుటవలన, బాధ్యతలను పంచుకొనుటద్వారా, కలసి కృషి సల్పుటవలన మనమెక్కువ సాధింపగలం. ఇందుకుగాను వ్యక్తిగత ముగా, సమిష్టిగా మన సమయాన్ని మన ధనాన్ని, చివరికి మన జీవి తములను సహితం యివ్వవలసి వస్తుంది. దేవునికి మొదటి స్థానమిచ్చి, ఈ లోకములో ప్రభువు తన సంఘమునకు ఆజ్ఞాపించిన రీతిగా కృషి సాగిస్తే, దేవుడు మనకు వాగ్దానము చేసినట్లుగా ఈ లోకమునందును పొందబోవు లోకములోను విజయము నొందుతాము.

వ్యక్తిగత క్రైస్తవులముగా కూడ మనము ఆగ్గనైజు చేయబడ వలెను. మన సమయాన్ని ధనాన్ని యింతకంటె విజ్ఞతగా ఉపయో గించుకొనేటట్లు మనకు మనమే క్రమశిక్షణ కల్గియుండాలి. చిన్న విషయాలకంటే పెద్ద విషయాలపై లక్ష్యముంచాలి. మనము ఏమి నమ్ముచున్నామో, ఎందుకు నమ్ముచున్నామో మనం తెలుసుకోవాలి. మనం ప్రకటించేదాన్ని పాటించేవారిలా యుండాలి. మన కుటుం బాల్లోను, సమాజములోను, సంఘమందు మనమేస్థితిలో యున్నామో తెలిసికొని సాధ్యమైనంతవరకు క్రీస్తు విషయమై ఫలప్రదముగా సాగి పోవాలి. మనకు మనం ప్రభువుకు సమర్పించుకొన్నట్లయితే మన జీవితాలు ధన్యమౌతాయి, నిష్ప్రయోజన విషయాలపై మనస్సు నిలిపితే నిరర్థకమౌతాయి. మన జీవితములను క్రమపరచుకొనునట్లును, మన చుట్టు యున్నవారికి మంచి ఆదర్శమును కనుబరచునట్లును, మన లను రక్షించి మనకు నిత్యజీవ నిరీక్షణను అనుగ్రహించిన వానికి మన జీవితములను సజీవ యాగముగా సమర్పించుకొనునట్లును దేవుడు మనకు సహాయము చేయునుగాక.

## "ఆదియందు దేవుడు........"

### *(In the beginning – God)*

"ఏదో కొంచెము ఉన్నది గనుక, కొంచెము ఎల్లప్పుడు ఉండెను." "శూన్యము నుండి శూన్యము వచ్చును." "ప్రతి యిల్లును ఎవడైనను ఒకనిచేత కట్టబడెను" (హెబ్రీ 3:4). వివేకవంతుడైన ప్రతిమానవుడు ఈ ప్రత్యక్ష సత్యముల నంగీకరించి తీరవలసినదే. మొదట ఏకకణాంగజీవియు, తరువాత ఈ బ్రహ్మాండమైన విశ్వమంతయును అనాధారముగ వాటియంతటఅవే ఉద్భవించెనని మిక్కిలి ఉద్రేకించిన ఊహగలవాడే చెప్పగలడు. ఎవని సహాయము లేక ఒక ఇల్లు దానియంతటదే పునాదులలో నుండి పైకి లేచి మానవ నివాస స్థానమైనట్లు గంభీరమైన కలలు కనగలిగినవాడే దానిని కనును.

జీవనోత్పత్తినిగూర్చియు, పదార్థోత్పత్తినిగూర్చియు పరిణామ సిద్ధాంతము జవాబు చెప్పలేక ఓడిపోయినట్లు గత సంచికలో గమనించితిమి. పురాతనమైన గతములోనికి పరిణామ సిద్ధాంత్రీకులు ఆలోచించుకొనుచు ఎంత వెనుకకు వెళ్ళినను, అంతకు ముందుగనే ఉనికిని కలిగియున్న జీవకణముతోను, పదార్థముతోను అతడు ఆరంభించును. అయితే ఈ జీవకణము ఎక్కడనుంచి వచ్చెను? అని మన మడుగ వచ్చును. ఈ సిద్ధాంత్రీకులు దేవుని ఉనికిని అంగీకరించక పోయినను వారి సిద్ధాంత్రీకరణలో ఎప్పుడో ఒకప్పుడు 'ఆదిశక్తి' లేక 'సృష్టికర్త' యొక డుండెనని బుద్ధికి తోచుచున్నది. ఈ కర్తను బైబిలు 'దేవుడు' పిలుచుచున్నది. ఈ సంగతులను మనము గమనించినపిదప దావీదు అలనాడు "దేవుడు లేడని బుద్ధిహీనులు తమ హృదయములలో అనుకొందురు" అని చెప్పుటలో ఆశ్చర్యము లేదు.

వ్యక్తిగత దేవుని ఉనికియే క్రైస్తవ్యమునకు మూలాధా

రము. ఈ పునాదిపై క్రైస్తవ్యమంతయును ఆధారపడి యున్నది. ఈ జీవన సూత్రమును దానినుండి తొలగించిన యెడల క్రైస్తవ్యమంతయును కూలిపోవును. కనుక ఇందిమిడియున్న సంగతులను బట్టి "దేవుడు ఉన్నట్లు మన మెరుగగలమా?" అని ప్రశ్నించు కొందము. సర్వజ్ఞానియు, సర్వశక్తిమంతుడునై, లోకమంతటిని సృష్టించి పిచ్చుక పాటును సహితము కనిపెట్టుచున్న యట్టి దేవుని ఉనికినిగూర్చి మనకు సంతృప్తికరమైన ఆధారములుకలవా? ఈ అధ్యాయములో దానికి ఋజువులనిచ్చి, దానివలన మనము గ్రహించిన సంగతులనుబట్టి జవాబును పొందు పరచుదము.

## విశ్వ స్వరము (The Voice of the Universe)

భూమియు, దాని చుట్టునున్న గ్రహములును ఒక బ్రహ్మాండమైన వాస్తుశాస్త్రపు విద్దె. బ్రహ్మాండమైన విశ్వములో భూమి ఒక చిన్న భాగమైనందున విశ్వము మానవజ్ఞానమునకు మించినదై యున్నది. అంతరిక్షమును ఏలుచు తన రథములో పయనించు పగటి రాజును గమనించుము. తన తెల్లబారిన కాంతిలో రేజీకటిని ధైర్యముతో పారదోలుచు ఆకాశ విశాలములో నెగురు రేరాణి నొకమారు చూడుము. విలువైన ముత్యములతో పొదగబడి నట్లగుపడు ఆ యంతరిక్షము నొకసారి పరిశీలించుము. ప్రకృతి నేత్రములతో ఒకడు 6 వేల నక్షత్రములనే చూడగలుగునని అంచనా వేయబడెను. మిక్కిలి శక్తివంతమైన దూరదర్శిని సహాయముతో ఇంచుమించు 60 లక్షల నక్షత్రములను చూడవచ్చునని కూడా అంచనా వేయబడెను. అయితే దూరదర్శినివలన కనుగొనబడలేని కోటానుకోట్ల నక్షత్రము లింకను యున్నవి. భూమికిని, మిగిలిన గ్రహములకును, మానవ జ్ఞానము ఊహించలేనంత దూరము కలదు. 25 వేల మైళ్ళు గల ప్రపంచమును చుట్టి తిరిగివచ్చుట చాలా దూరమని మనము తలంచెదము. అయితే ఎవరైనను చంద్రలోకానికి వెళ్ళుచున్నట్లు

మీరు వినిన, అతడు భూమినుండి 2240 వేల మైళ్ళదూరం ప్రయాణించవలెనని తెలిసికొనగలరు. భూమికిని, సూర్యునకును మధ్య గల దూరాన్ని బట్టి చూస్తే ఇది బహు తక్కువ. సూర్యుడు భూమికి 9 కోట్ల మైళ్ళ దూరములో యున్నాడు. అంతేకాదు - భూమికి అతి సమీపములో నున్న నక్షత్ర సమూహము 200 కోట్ల మైళ్ళ దూరములో యున్నది. వెలుగు ఒక సెకనుకు 186 వేల మైళ్ళు ప్రయాణించునని ఎరిగిన తరువాత ఖగోళ దర్శకులు దూరమును కొలుచుటకు "కాంతి సంవత్సరమును" ప్రవేశపెట్టిరి. సెకనుకు 186 వేల మైళ్ళ చొప్పున, వెలుగు ఒక సంవత్సరములో ప్రయాణించు దూరమును 'కాంతి సంవత్సరము' తెలియజేయును. మనకతి సమీపగనున్న నక్షత్రమునుండి వచ్చు వెలుగు ఆ నక్షత్రమునుండి 5 సం॥ల తరువాత భూమికి చేరుచున్నది. కొన్ని నక్షత్రములు భూమినుండి 32 కాంతి సంవత్సరముల దూరములో కలవు. మరికొన్ని అంతకు మించిన దూరములో కూడ కలవు. విశ్వమంతయును ఒక బ్రహ్మాండమైన వాస్తుశాస్త్రపు విద్య యని అంగీకరించునంతలో "ఈ వాస్తు శాస్త్రవేత్త యెవరు!" అనే ప్రశ్న మనలో తప్పక ఉద్భవించును.

విశ్వమంతటిలోను చక్కటి క్రమము గలదు. విశ్వమును పరిశోధించిన ఖగోళ దర్శకులు మానవునికి నివాసయోగ్యముగా భూమి ఒక్కటి మాత్రమే యున్నదని తెలిసికొనిరి. ఉదాహరణకు - "బుధుడు" (Mercury) అను గ్రహము భూమికంటె 7 రెట్లెక్కువ సూర్యరశ్మిని పొందుచున్నది. అంటే వేసవిలో ఆ గ్రహమంతయును 700 డిగ్రీల ఉష్ణోగ్రతతో అగ్ని గంధకమువలె మానవ, జంతుజీవన యోగ్యము కాని స్థితిలో నుండునన్న మాట!

సూర్యునినుండి భూమికంటె వందరెట్లు దూరముగనున్న అతి చిక్కటి శీతలమగు 'వరుణ' గ్రహము (uranus) కూడా కలదు. అనగా ఈ గ్రహమందలి ఉష్ణోగ్రత సున్న కంటె 2-3 వందల డిగ్రీల

తక్కువ. అంతేకాదు – దాని గ్రహమార్గము (Orbit) చాల ఎక్కువ అగుటచే భూమియొక్క 84 సం॥లు ఆ గ్రహపు ఒక్క సంవత్సరమునకు సమానమగును. అనగా భూమి సూర్యునిచుట్టు 84 మారులు తిరుగ సరికి అది ఒక్కమారే తిరుగును.

మానవ నివాసయోగ్యమగు భూమి తప్ప సూర్యకుటుంబము లోని గ్రహములన్నిటికిని ఈ హేతువాదము వర్తించును. ఈ భూగ్రహమందును కూడ ఆశ్చర్యమైన క్రమమును మనము చూడగలము. భూమి చుట్టుకొలత ఇంచుమించు 25 వేల మైళ్ళు కలదు. అనగా భూవ్యాసము 8 వేల మైళ్లు. అట్లుగాక భూవ్యాసము 9 వేల మైళ్లున్న యెడల భూమ్యాంతర ఉష్ణోగ్రత బహు ఎక్కువై అది మానవ నివాస యోగ్యము కాని గ్రహమువలె యుండునని శాస్త్రజ్ఞులు కనుగొనిరి. భూవ్యాసము 7 వేల మైళ్ళు మాత్రమే అయితే భూమ్యాంతర ఉష్ణోగ్రత బహు తక్కువై అది జీవనయోగ్యము కానిదగును. ఒక ఆకస్మిక సంఘటన ఇంత విశేషక్రమమునకు కర్తయగుట అసాధ్య మగుటచే "ఈ నమూనాను లేక క్రమము నేర్పరచిన వాడెవడు ?" అను ప్రశ్నను మన మెదుర్కొనవలసి వచ్చును.

భూమితోసహా మిగిలిన అంతరిక్ష గోళము లొకదాని కొకటి అతి ఖచ్చితముగా క్రమప్రకారము చలించుట మరింత ఆశ్చర్యకర మైన సంగతి. సూర్యుడు నిదురపోవుట నీవు ఎన్నడైనను గమనించి తివా ? లేదు; దినదినము సంవత్సర, సంవత్సరము భూమి తన ఇరుసుపై 24 గంటల కాలంలో తన చుట్టూ తాను తిరుగుచు ప్రమాదములు ఏమియును లేకుండగనే మనకు రేయింబగళ్ళ నిచ్చుచున్నది. వేసవి కాలముగాని, వర్షాకాలముగాని రాకపోవుటను నీవు ఎన్నడైన గమ నించితివా ? ఎన్నడు లేదు. భూమి తనచుట్టు తాను తిరుగుచు, సూర్యునిచుట్టు తిరుగుటచే ఒక సంవత్సరములోని నాలుగు కాలములకు మనకు తెచ్చుచున్నది. ఖగోళ దర్శకులు గ్రహచలనములను గ్రమ

నించి ఫలాని దినమున ఇన్ని గంటల ఇన్ని నిముషములకు సూర్య లేక చంద్రగ్రహణము జరుగగలదని ముందుగానే చెప్పగల్గునంత ఖచ్చిత ముగా ఈ గ్రహములు చలించుచున్నవి. ఇంత ఆశ్చర్యకరమైన అతి ఖచ్చిత గణిత క్రమము నెరిగిన తరువాత "ఈ గణిత శాస్త్రజ్ఞుడెవరు?" అని మనము ప్రశ్నించ వచ్చును. దీని బారినుండి తప్పించుకొనుటకు, గ్రహములన్నియును ఒక చట్టమునకు లోబడి చలించుచున్నవని నాస్తికుడు చెప్పును. చట్టమంటూ ఒకటి యుంటే, అది దాని ఆధారమును కూడా తెలియజేయును. మనదేశపు చట్టముల నెవరు తయారుచేయక, వాటంతటవే వచ్చిపడెనని నాస్తికులను నిరూపించనిమ్ము! గ్రహము లన్నియు నొక చట్టమునకు లేక సూత్రమునకు లోబడి చలించుచున్న యెడల, ఆ సూత్రధారి యెవడు?

## రసాయనిక శాస్త్ర స్వరము

## (The Voice of Chemistry)

భూమియు, భూవాతావరణమును రసాయనిక మూలకములతో నిండియున్నది. ఈ మూలకము లన్నిటిని మిశ్రమము చేసిన వాడంటూ ఒకడుండెనని అవే చెప్పగలవు. విజ్ఞానశాస్త్రపు మిశ్రణము ఎక్కడ ఉండునో అక్కడ దానికి కర్తయైన జ్ఞాని తప్పక యుండును. గణిత శాస్త్రమందు మనకు 10 అంకెలుగలవు. ఈ అంకెలను తెలివితో అటు ఇటు లమర్చుటవలన అనేక గణిత మిశ్రమములను మనము తయారు చేయవచ్చును. అయితే ఒక ప్రత్యేక లెక్కలోని సంఖ్యల నెవరు అమర్చక వాటియంతటవే జవాబుగా తయారు కాగల వనుట ఊహాతీతమైనది.

తెలుగు భాషలో మనకు 54 అక్షరము లున్నవి. వాటిని తెలివిగా అటు నిటు లమర్చుటవలన మనము సాహిత్యమును తయారు చేయుచున్నాము. అయితే ఆ యక్షరములన్నియు ఎవరి సహాయము లేకుండగ వాటియంతట అవే "23వ దావీదు కీర్తన" ఆయెనని లే

"క్రీస్తు కొండమీద ప్రసంగముగా" ఆయెనని తలంచుట ఊహాతీత మైనది.

అట్టి బ్రహ్మాండమైన విజ్ఞానమును విశ్వమునందు మిశ్రమమై యున్న మూలకములలో కూడ మనము చూడగలము. ఈ క్రింద నీయబడిన 2 ఉదాహరణలను గమనించుము :—నీరు రెండుపాళ్ళు హైడ్రోజన్‌తోను, ఒకపాలు ఆక్సిజన్‌తోను తయారైనది ($H_2O$). హైడ్రోజన్ వాయువు మిక్కిలి సులభముగ మండెడు గుణముగలది. అగ్నిని తయారుచేయుటకు ఆక్సిజన్ వాయువు తప్పక యుండవలెను. అయినను ఈ రెండు రసాయనములను పైన జెప్పబడిన నిష్పత్తిలో కలిపినయెడల మనము దాహమును దీర్చుకొనుటకును శరీర ధూళిని కడిగివేసికొనుటకును ఉపయోగించు నీరు లభించును. మాలిన్యరహిత మైన గాలి 79 పాళ్ళు నైట్రోజన్ వాయువును, 21 పాళ్ళు ఆక్సిజన్ వాయువును కలిగియున్నది. గాలిలో ఆక్సిజన్ పాళ్ళను కొంచెము తగ్గించినట్లయిన మన శరీరపు పెరుగుదల తగ్గి క్రమేప మరణములోనికి నడిపించును. ఆక్సిజన్ పాళ్ళను కొంచెము హెచ్చించినయెడల హృదయ నాడీస్పందనములు బహు ఎక్కువై వెంటనే మనకు మరణము ప్రాప్తియగును. అయితే ఈ రెండు మూలకములను పైన జెప్పబడిన నిష్పత్తిలో కలిపిన అవి మనము భూమిపై పుట్టిన నాటి నుండి చనిపోవువరకు అవసరమగు గాలినిచ్చును.

వాతావరణములో అవియేగాక అనేక వేలకొలది ఇట్టి క్రమబద్ధమైన మిశ్రమములున్నవి. అవి యన్నియును ఒక ఆకస్మిక సంఘటనవలన కలిగెనని అవివేకులు మాత్రము చెప్పగలరు. కాబట్టి ఈ రసాయనిక మూలకముల నన్నిటిని మిశ్రమము చేసిన రసాయనిక శాస్త్రవేత్త యెవడు? అని ప్రశ్నించుచున్నాము.

## ప్రసిద్ధ చిత్రకారుడు

ప్రకృతి పుటలలోని మహోనీయ కళలను వర్ణించుట మనకు సాధ్యముకాదు. మనమందరమును సుందరమయిన సూర్యాస్తమయ

మును చూచితిమి. పశ్చిమ క్షితిజములోనికి సూర్యుడు మెల్లమెల్లగా దిగుచు, ఆకాశము నంతను తన చిత్రవిచిత్ర రంగులతో నింపుచు ప్రఖ్యాత కవులనుండి, సామాన్య మానవునివరకు అందరనీ ఉత్తేజ పరచుట నీవు గమనించితివి. నీవు ఎన్నడైనను హిమాలయములకు వెళ్ళియుంటే మంచుతో కప్పబడిన ఆ పర్వత శిఖరములను పచ్చని కంబళిలో చుట్టబడియున్నట్లగుపడు ఆ లోయలను చూస్తూ యుంటే అది యంతయు ఒక మహనీయుని పనియని ఇట్టే గమనించగలవు. రకరకాల గులాబీలు, చేమంతులు, సన్నజాజుల పరిపూర్ణములలోని మహనీయ చిత్రకారుని కృషిని గమనించుము. తుఫాను మేఘములలో నుండి తొంగిచూచుచున్నట్లగుపడుచు, ఆకాశములో వ్రేలాడు ఇంద్ర ధనస్సులోని పరిపూర్ణ వర్ణములను గమనించుము. పైన ఆకాశము నందు గాని, క్రింద భూమియందుగాని మనము చూచుచున్న ఒక ప్రఖ్యాత చిత్రకారుని పనులలో ఇవి కొన్ని మాత్రమే. కాబట్టి "ఈ మహనీయ చిత్రకారుడు ఎవరు?" అని మనము ప్రశ్నించుట సముచితమే. ఇంత మహనీయ కళావిద్య యంతయు ఏ సహాయక లేక యే కలిగెనని తలంచుట అవివేకము కాగలదు.

## జీవమునుండి ఒక ఋజువు

జీవము దానికి ముందున్న జీవమునుండి ఉద్భవించునను సంగతి అందరు అంగీకరించినదే. పరిణామ సిద్ధాంతీకులు కూడ ఈ సూత్రము నంగీకరించుచు జీవరాసు లన్నియును ఆదియందున్న ఏక కణాంగ జీవినుండి బయల్వెడలెనని చెప్పెదరు. అయితే ఈ ఏక కణాంగ జీవి జీవ మెక్కడనుండి వచ్చెనో వారు చెప్పుటలో విఫలులైరి. మానవుడు జీవమును, లేక ప్రాణమును తయారుచేయలేడు. అతడు ప్రాణము నొకవేళ నాశనము చేయవచ్చును. అయితే ఒక జీవి నాశనము చేయబడిన యెడల ప్రపంచమందున్న విజ్ఞానమంతయును దానికి తిరిగి జీవమును పోయజాలదు. గోధుమలను తయారుచేయుటకు అవుసరమగు

పదార్థము లన్నిటిని శాస్త్రవేత్త తీసికొని రసాయనిక మూలకములతో గోధుమలవంటి రుచిగల కల్పిత గోధుమల నతడు తయారుచేయవచ్చును. అయితే అతడు తయారుచేసిన ఈ కల్పిత గోధుమగింజను భూమిలో పాతిపెట్టిన యెడల మొలకెత్తునా ? మొలకెత్తదు! ఎందుచేత ? ఏల యనగా అతడు దానిలో జీవమును పోయజాలడు. వివిధ స్థానములలో ప్రాణులుండుట మనకు ఒక "ప్రాణదాతను" జ్ఞప్తికి తెచ్చుచు, అతని ఉనికిని ధృవపరచుచున్నది.

ఇంతవరకు మనము చూచిన ఋజువుల నీ క్రిందిపట్టికలో నిచ్చుచున్నాము. చదువరులు జాగ్రత్తగా గమనించవలెను.

| | | |
|---|---|---|
| సృష్టి — సృష్టికర్తను | | సూచించుచున్నది. |
| వాస్తు శాస్త్రవిద్య — వాస్తు శాస్త్రవేత్తను | | ,, |
| నమూనా — నమూనాదారుని | | ,, |
| గణితక్రమము — గణితజ్ఞుని | | ,, |
| విజ్ఞానము — విజ్ఞానిని | | ,, |
| సూత్రము — సూత్రధారిని | | ,, |
| రసాయనిక శాస్త్రము — రసాయనిక శాస్త్రవేత్తను | | ,, |
| కళ — కళాకారుని | | ,, |
| ప్రాణము — ప్రాణదాతను సూచించుచున్నది. | | |

పైన ఈయబడిన పట్టిక దానిని గూర్చి అదే చెప్పుకొనుచున్నది. ఈ గంభీర విశ్వమందున్న ఋజువులలో మనమొక సృష్టికర్తను, ఒక గణితజ్ఞుని, ఒక సూత్రధారిని, ఒక రసాయనిక శాస్త్రవేత్తను, ఒక కళాకారుని, ఒక ప్రాణదాతను చూడగలుగుచున్నాము. వీని నన్నిటిని విశ్వమందు మనము చూచునప్పుడు వాని వెనుక నున్న గంభీరజ్ఞానమును కూడ గమనించగలుగు చున్నాము. పైన చెప్పబడిన క్రియలకు ఒక గంభీరజ్ఞాని యుండనవసరము లేదని నాస్తికులు చెప్పగలరేమో చూద్దాం! ఒక గంభీరజ్ఞానమును గూర్చి మనము

చెప్పుకొనునపుడు మన ఆలోచనలలో ఒక గంభీరవ్యక్తిలేక మూర్తి నిలుచుచున్నాడు. జ్ఞానినుండి జ్ఞానమును వేరుచేయుట దుస్సాధ్యము. జ్ఞాని లేక పట్టిజ్ఞానమే జరిగించిన ఒక విశేషక్రియను నాస్తికులు చూపించగలరేమో వారినే అడుగుదాం!

ప్రపంచమందున్న సమస్తాశ్చర్యములకు వెనుక నున్న గంభీర వ్యక్తియే "దేవుడు". దీనికింక తిరుగు లేదు. "అంతరిక్షము ఆయన చేతి పనిని ప్రచురపరచుచున్నది" అని దావీదు సత్యమునే పలికెను. ప్రకృతి పుటలలో దేవుని ఉనికి అతివిపులముగా కనపడుచున్నది. దీనినే ఈ అధ్యాయమునందు చూపించుటకు మేము ప్రయత్నము చేసితిమి. గనుక దేవుడు తనకు తానుగా బయలుపరచిన బైబిలును గూర్చి వచ్చే సంచికలో పరిశీలిద్దాం.

—మోరిస్ W. R. బెయిలీ.

---

## ఎదుటి వారికి బోధించు నీవు....

"ఎందుకనగా దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులుగల ఎట్టువంటి ఖడ్గము కంటెను వాడిగా ఉండి ప్రాణాత్మలను కీళ్ళను మూలుగను విభజించునంత మట్టుకు దూరుచు, హృదయము యొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది" హెబ్రీ 4:12.

ఎదుటి వానికి నీవు బోధించువాటిలో కొన్ని :

1. నిన్నువలె నీ పొరుగువారిని ప్రేమించుము.
   గలతీ 5:14, రోమా 13:9; లూకా 10:33, 34.
2. ఐక్యత కలిగి జీవించవలెను. కీర్తన 133:1, 1 కొరింథీ 1:10.
3. సహోదరులకు, అందరికి మేలు చేయవలెను.
   గలతీ 6:10, రోమా 15:2, రోమా 12:13, అపొ. కా. 20:35.
4. పరిచర్య చేయాలి. మార్కు 10:43, 45; యోహాను 13:4-5.

5. ప్రభువునందే అతిశయించవలెను.

2 కొరింథి 10:17, యిర్మియా 9:24.

6. ఉప్పువలె, వెలుగువలె లోకానికి కన్పించాలి.

మత్తయి 5:13, 14; ఫిలిప్పీ 2:16.

7. దేవుని పనిలో నమ్మకముగా ఉండాలి.

1 కొరింథీ 4:2; సంఖ్యా 12:7; ఎఫెసీ 4:14, 15; హెబ్రీ 3:6.

8. విగ్రహారాధన పాపము.

యెషయా 44:14-20; కీర్తన 135:15, 16; ప్రకటన 21:8.

9. మద్యపానము చేయరాదు.

ఎఫెసీ 5:18; సామెత 20:1; 1 తిమోతి 3:3.

10. సువార్త ప్రకటించవలెను.

మార్కు 16:15; 2 తిమోతి 4:2; అపొ. కా. 8:4, 5.

## II నీ అనుసరణలో ఉన్నవి ఎన్ని ?

1. నాది నాదే. లూకా 10 : 31, 32; మత్తయి 25 : 41-45.
నీదంతా నాది లూకా. 10:30.

2. పులిసిన పిండివలె ఉండుట. 1 కొరింథి 5:6, 7.
భేదములు కల్గించుట. యాకోబు 2:2-4.

3. మాటలతో సంతృప్తిపరచుట. యాకోబు 2:15, 16.

4. ప్రధానత్వం కోరుట. 3 యోహాను 9వ

5. శరీర సంబంధమైన విషయాలలో అతిశయించుట.

యిర్మియా 9:23; 2 కొరింథి 11:18.

6. నిస్సారమైన ఉప్పువలె, కుంచం క్రింద దీపంవలె

మత్తయి 5 : 13, 15.

7. ఇహలోకాన్ని స్నేహించి, సత్యాన్ని అమ్మివేయుట.

తీతు 1 : 10, సామెత 23 : 23, మత్తయి 25 : 24, 25.

8. ధనాపేక్షయైన విగ్రహారాధన. కొలస్స 3:5, ఎఫెసి 5:5.

9. త్రాగుబోతువలె ఉండుట. ఆది 9:21, 1 కొరింథి 6:10.

10. సొంత కార్యములు చూచుకొనుట.

ఫిలిప్పీ 2 : 21, లూకా 10 : 40, 41.

ఎదుటివానికి బోధించు నీవు నీకు నీవే బోధించుకొనవా ! రోమా 2 : 21.

బోధకులమైన మనము మరి కఠినమైన తీర్పు పొందుదుము. యాకోబు 3 : 1.

మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారి ఎదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి. మత్తయి 5:16, 1 పేతురు 2:12.

నిన్ను గూర్చియు, నీ బోధను గూర్చియు జాగ్రత్త కలిగి యుండుము. వీటిలో నిలకడగా ఉండుము. నీ వీలాగు చేసి నిన్నును నీ బోధ వినువారిని రక్షించుకొందువు. 1 తిమోతి 4:16.

నా సహోదరులారా, క్రియలు లేనప్పుడు ఎవడైనను తనకు విశ్వాసము కలదని చెప్పినయెడల ఏమి ప్రయోజనము ? అట్టి విశ్వాసమతని రక్షింపగలదా ? యాకోబు 2:14.

— రెడ్డిబాబు సబ్బతి,
నూతిరామన్నపాలెం.

---

## సోమరికి హెచ్చరికలు

*( Instructions to the Sluggurd )*

సోమరిని గూర్చిన జ్ఞానోక్తులు, సోమరికిచ్చే హెచ్చరికలు అనేకములు సామెతలు గ్రంథములో మనకు కనబడతాయి.

సామెతలు 6:6-11 లో సోమరికిచ్చిన హెచ్చరికలలో పెద్దది మనకు కనబడతాది. సోమరియైన కుమారుడు చీమనుండి పనితనం

నేర్చుకోవాలని జ్ఞాని ఇక్కడ కోరుచున్నాడు. చీమలకు పై అధిపతి లేకున్నను అవి నిత్యమూ పనిచేస్తూనే యుంటాయి. అవి వేసవికాల మందు ఆహారము సిద్ధపరచుకొనును శీతకాలమందు ధాన్యము కూర్చుకొనును. నిద్రపోతులకు 9వ వచనము ఒక హెచ్చరికయై యున్నది. కొంతమంది యౌవనస్థులు అస్తమానం నిద్రపోతూనే యుంటారు (సామె 20 : 13; 26 : 14). ఎవరైనను లేపేవరకు పడక మీదనుండి లేవకుండా కొందరు ఉంటారు. అట్టివారు సాధించేది శూన్యం. ఇంకా కొంచెము నిద్రించెదనని కొంచెము కునికెదని వాడను కొంటాడు. అందుచేత దోపిగాడు వచ్చునట్లు దారిద్ర్యము వాని యొద్దకు వస్తాది (సామె 6:10, 11; 10:14; 2 థెస్స 3:10). చురుకైనవారిని, పనిచేసేవారినే దేవుడు ఎల్లప్పుడు పిలిచాడని, పిలుస్తాడని మనసునందుంచుకోవాలి (నిర్గమ 3:1-4; న్యాయాధి 6 : 11, 12; 1 రాజు 19:19-21; మత్త 4:18-22; 9:9; 11:28-30; అపొ. కా. 26 : 9-18).

యితరులకున్న మంచిసంగతులు తనకు కావాలని సోమరి ఆశిస్తాడు గాని వాటిని సంపాదించుకోడానికేమీ ప్రయత్నించడు, శ్రద్ధ చూపడు (సామె 13:4; 19:24; 12:27; 21:25). సరిగదా పనిచేయ కుండుట కతడు అనేకసాకులు చెబుతాడు (సామె 20:4; 22:13; 26:13). అతడేమీ పనిచేయడు గనుక ఏమీ సాధించడు. గనుక నష్టము చేయువానికి సోదరుడగుతాడు (సామె 18 : 9). సోమరి మార్గము ముళ్ళకంచె యని, అనగా దానిలో నడవడం నత్తనడకవంటి దని సామెతలు 15:19 చెప్పుచున్నది.

నీవు ప్రభువు పనిలో శ్రద్ధగలవాడవా ? సోమరివా ?

—నేరీ హాంప్టన్.

---

గమనిక :-మీ అడ్రస్సులో మార్పు వచ్చినప్పుడు మీ సత్యవాక్య సంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం.

# కొండెములాడుట పాపము

## *(The sin of Talebearing)*

దేవుని ప్రజలు ఈ లోకంలో యున్నా, వారు ఈ లోకస్థులు కాదు. దేవుడు ఇశ్రాయేలీయులకు ఇట్లు చెప్పాడు: "మీరు నివసించిన ఐగుప్తుదేశాచారముల చొప్పున మీరు చేయకూడదు; నేను మిమ్మును రప్పించుచున్న కనానుదేశాచారముల చొప్పున మీరు చేయకూడదు, వారి కట్టడలనుబట్టి నడవకూడదు" (లేవీ 18:3).

మనం క్రొత్త నిబంధన క్రింద జీవించుచున్నాము (హెబ్రీ 10:9, 10; 9:15-17). క్రైస్తవులు లోకరీత్యా నడువరాదని తీవ్రముగా హెచ్చరింపబడ్డారు (యాకోబు 4:4; 1 యోహాను 2:15-17).

ప్రభువు ప్రజలు కొండెము లాడరాదని హెచ్చరింపబడింది. మరొకని గౌరవ ప్రతిష్టలకు భంగము కలిగే రీతిగా ప్రభువు ప్రజలు కొండెములు, అబద్ధములు కల్పించరాదు. మీరాలాగున క్రీస్తును నేర్చుకొన్నవారు కారు అని పౌలు చెప్పుచున్నాడు (ఎఫెసీ 4:20).

దేవుని ప్రజలు కొండెములు చెప్పరాదు. "నీ ప్రజలలో కొండెములాడుచు ఇంటింటికి తిరుగకూడదు, నీ సహోదరునికి ప్రాణహాని చేయకూడదు, నేను యెహోవాను" (లేవీ 19:16). ఈ హెచ్చరిక అప్పుడు ఇప్పుడు కూడ సత్యమే. "జీవమును ప్రేమించి మంచి దినములు చూడగోరువాడు చెడ్డదాని పలుకకుండ తన నాలుకను, కపటపు మాటలు చెప్పకుండ తన పెదవులను కాచుకొనవలెను" (1 పేతురు 3:10).

చెడ్డ నాలుక ఎంత వినాశకరమైనదంటే, దాని శాపం నుండి మనం తప్పింపబడేటట్టు ప్రార్థించాలి. "యెహోవా, అబద్ధమాడు పెదవులనుండియు మోసకరమైన నాలుకనుండియు నా ప్రాణమును విడిపించుము" (కీర్తన 120:2). అబద్ధములాడు నాలుక వలన కలిగే ఘోర దుష్టత్వాన్ని దృష్టిలో యుంచుకొనునప్పుడు మన నాలుకను

గూర్చి మనం ఎట్లుండాలి ! దానికి జవాబు యిది : "నా నాలుకతో పాపము చేయకుండునట్లు నా మార్గములను జాగ్రత్తగా చూచుకొందును. భక్తిహీనులు నా యెదుట నున్నప్పుడు నా నోటికి చిక్కము ఉంచుకొందు ననుకొంటిని" (కీర్తన 39:1).

అబద్ధికులు ప్రతి యుగంలోను ఉన్నారు. వారి కథ ఎప్పుడూ ఒక్కటే. వారి అబద్ధాలు కృంగదీస్తాయి, పాడుచేస్తాయి, నాశన పరుస్తాయి. అబద్ధములాడేవాడు, వాటిని వినేవాడు ఒకే స్వభావం కలవారు. కల్లలాడు నాలుక అహంకార దృష్టితోను, నిరపరాధులను చంపు చేతులతోను సమానమైన పట్టికలో చేర్చబడింది (సామె 6:17). "చెడు నడవడి గలవాడు దోషపు మాటలు వినును. నాలుక హానికరమైన మాటలు పలుకుచుండగా అబద్ధికుడు చెవి యొగ్గును" (సామె 17 : 4).

అబద్ధములాడు నాలుక కలహము పుట్టించును : "వేడి బూడిదెకు బొగ్గులు అగ్నికి కట్టెలు, కలహము పుట్టించుటకు కలహప్రియుడు, కొండెగాని మాటలు రుచిగల పదార్థములవంటివి" (సామె 26:21, 22). తనకు పట్టని జగడమునుబట్టి రేగువాడు దాటిపోవుచున్న కుక్క చెవులు పట్టుకొను వానితో సమానుడు (సామె 26:17).

అబద్ధములాడు నాలుక కోస్తాది, గాయపరుస్తాది. "మోసము చేయువాడా, వాడిగల మంగల కత్తివలె నీ నాలుక నాశనముచేయ నుద్దేశించుచున్నది. మేలుకంటె కీడు చేయుటయు నీతి పలుకుటకంటె అబద్ధము చెప్పుటయు నీ కిష్టము" (కీర్తన 52:2, 3). ఇంకా కీర్తనల గ్రంథకర్త యిట్లు చెప్పాడు : నా ప్రాణము సింహముల మధ్య నున్నది. కోపోద్రేకుల మధ్యను నేను పండుకొనుచున్నాను. వారి దంతములు శూలములు, అవి అంబులు. వారి నాలుక వాడిగల కత్తి" (కీర్త 57:4). "కొండెగాని మాటలు రుచిగల భోజ్యములు. అవి లోకడుపులోనికి దిగిపోవును" (సామె 18:8).

అబద్ధములాడువారి గతి శోచనీయం. "జీవమరణములు నాలుక వశము. దానియందు ప్రీతిపడువారు దాని ఫలము తిందురు" అని సొలొమోను పలికాడు (సామె 18:21). "ఉత్తరపుగాలి వాన పుట్టించును, కొండెగాని నాలుక కోపదృష్టి కలిగించును" (సామె 25:23). "అబద్ధములాడువాడు తాను నలుగగొట్టిన వారిని ద్వేషించును. ఇచ్చకపుమాటలాడు నోరు నష్టము కలుగజేయును" (సామె 26:28).

మరణకరమైన ఈ దుష్టత్వమునుండి మనమెట్లు విడుదల పొందగలము? కొండెగాడు దుర్మార్గతను విరమించుకొనుటవల్లనే. "కట్టెలు లేనియెడల అగ్ని ఆరిపోవును. కొండెగాడు లేనియెడల జగడము చల్లారును" (సామె 26:20). బద్ధకస్థులు వదరబోతులు కలిసే యుంటారు. "మరియు వారు ఇంటింట తిరుగులాడుచు బద్ధకురాండ్రగుట మాత్రమేగాక, ఆడరాని మాటలాడుచు వదరబోతులును పరులజోలికి పోవువారునగుటకు నేర్చుకొందురు" (1 తిమో 5:13).

పౌలు కాలంలో కొందరు పని మానేసి వదరుబోతులుగ తయారయ్యారు. "అట్టివారు నెమ్మదిగా పనిచేయుచు సొంతముగా సంపాదించుకొనిన ఆహారము భుజింపవలెనని మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట వారు ఆజ్ఞాపూర్వకముగా" హెచ్చరింపబడ్డారు (2 థెస్స 3:11, 12). నాలుక చిన్నదే అయినను అది హానికరమైనదని జ్ఞాపకముంచుకొందాము. నాలుక కూడ చిన్న అవయవమైనను బహుగా అదిరి పడును. ఎంత కొంచెము నిప్పు ఎంత విస్తారమైన అడవిని తగులబెట్టును" (యాకోబు 3:5).

మంచికొరకే మన నాలుక వినియోగింపబడునట్లు చూద్దాం. అప్పుడు కేవలం మేలే కలుగును. "సాత్వికమైన నాలుక జీవవృక్షము. దానిలో కుటిలత యుండినయెడల ఆత్మకు భంగము కలుగును" (సామె 15:4).

—గార్లండ్ ఎల్కిన్స్

# బాప్తిస్మము ఎవరికి?

## *( For whom is Baptism ? )*

**1.** రక్షింపబడని వారికి :

"మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధింపబడును" (మార్కు 16: 15, 16).

**2.** సువార్త వినిన వారికి :

"ఆ సమాజ మందిరపు అధికారియైన క్రిస్పు తన యింటివారందరితో కూడ ప్రభువునందు విశ్వాసముంచెను. మరియు కొరింథీయులలో అనేకులు విని విశ్వసించి బాప్తిస్మము పొందిరి" (అపొ. కా. 18:8).

**3.** బోధింపబడిన వారికి :

"కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులుగా చేయుడి; తండ్రియొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మ మియ్యుడి" (మత్త 28:19).

**4.** వాక్యము నంగీకరించిన వారికి :

"కాబట్టి అతని వాక్యము నంగీకరించినవారు బాప్తిస్మము పొందిరి. ఆ దినమందు ఇంచుమించు మూడువేలమంది చేర్చబడిరి" (అపొ. కా. 2:41).

**5.** విశ్వాసులకు :

"నమ్మి బాప్తిస్మము పొందువాడు రక్షింపబడును, నమ్మనివానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:16; అపొ. కా. 8:37).

6. మారుమనస్సు పొందినవారికి :

"మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతి వాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" (అపొ.కా. 2:38).

7. స్త్రీలకు పురుషులకు :

"అయితే ఫిలిప్పు దేవుని రాజ్యమును గూర్చియు యేసుక్రీస్తు నామమునుగూర్చియు సువార్త ప్రకటించుచుండగా వారతని నమ్మి, పురుషులును స్త్రీలును బాప్తిస్మముపొందిరి" (అపొ.కా. 8:12).

ఈ లేఖనములనుబట్టి పసిబిడ్డలు, వాక్యము బోధింపబడని స్త్రీ పురుషులు బాప్తిస్మము పొందుట కనర్హులని మనం గ్రహింపవచ్చు.

—గేల్ ఓలర్.

---

# క్రీస్తు సంఘము పరిశుద్ధాత్మ

అనేక పర్యాయములు భారత దేశములోని పెంతెకొస్తు బోధకులు క్రీస్తు సంఘమునకు పరిశుద్ధాత్మయందు నమ్మిక లేదని చెప్పుదురు. క్రీస్తుసంఘ సిద్ధాంతము ఏమి లేదు. నీవు బైబిలులో వెదకిన అటువంటిదేమీ కనపడదు. మతశాఖలన్నిటికి వాటి సిద్ధాంతములు కలవు. కాని బైబిలునందు క్రీస్తుయొక్క సిద్ధాంతము మాత్రమే కలదు. మనము క్రీస్తు బోధయందు నిలచి యుండవలెను (2 యోహాను 9). ప్రతి మతశాఖ దాని సిద్ధాంతమును తయారు చేసినది. ప్రతి మత శాఖ దాని సిద్ధాంతములను దానికిని, కాలమునకును అనువుగ మార్చుకొనుచున్నది. కాని క్రీస్తు సిద్ధాంతము ఎల్లప్పుడును ఒకటిగనే యున్నది.

యేసు చెప్పెను : "ఆకాశమును, భూమియు గతించును గాని నా మాటలు ఏమాత్రమును గతింపవు" (మత్తయి 24:35). నూతన నిబంధన క్రైస్తవ్యమునకు సంపూర్ణముగ మరలుమని క్రీస్తు సంఘములు బోధించుచున్నవి. ఈస్థితి కదల్చబడనిది. అందుచే మతశాఖలు క్రీస్తు సంఘస్థితిని తప్పుడు ప్రచారముతో నెదుర్కొనుచున్నవి. అందుచే భారతదేశములో పలుచోట్ల క్రీస్తు సంఘములు పరిశుద్ధాత్మయందు నమ్మికలేదు అని ప్రకటించబడుచున్నది. ఇది అసత్యము. ఇది ఒక తెలియని అసత్యము లేక తెలిసి చెప్పిన అసత్యము కావచ్చును కాని ఇది అసత్యము.

తండ్రి, కుమారులతో నివసించుచున్న ఒక వ్యక్తిగా పరిశుద్ధాత్మను గురించి బైబిలు విపులముగా చెప్పుచున్నది. "ఆత్మ తానే మన పక్షముగా విజ్ఞాపన చేయుచున్నాడు" (రోమా 8:26). యోహాను 16:13 లో పరిశుద్ధాత్మను ఆయన అని రెండుమార్లు వ్రాయబడెను. 14వ వచనములో రెండుమార్లును, 15వ వచనములో ఒకసారియును వ్రాయబడెను. కావున పరిశుద్ధాత్మ ఒక వ్యక్తి. ఈవ్యక్తి అపొస్తలులను సత్యములోనికి నడిపించెను (యోహాను 16:13). పరిశుద్ధాత్మ యేసు చెప్పిన సంగతులన్నిటిని వారి స్మృతిలోనికి తెచ్చెను (యోహాను 14:26).

సర్వసృష్టికి సువార్త ప్రకటించవలెనని యేసు చెప్పెను (మార్కు 16:15). సువార్త నమ్ము ప్రతివానికి దేవునిశక్తి యని పరిశుద్ధాత్మ చెప్పెను (రోమా 1:16). మనుష్యులు పరిశుద్ధాత్మవలన స్వయముగా రక్షింపబడుదురని పెంతెకొస్తువారు బోధించుదురు. చదువరులెవరైన పెంతెకొస్తు ఆరాధనకు హాజరయితే వారు పరిశుద్ధాత్మను దిగిరమ్మని ప్రార్థించుట వినియుందురు. బోధించబడిన సువార్త నమ్మువానిని రక్షించునని పరిశుద్ధాత్మ సెలవిచ్చెను. నేను పెంతెకొస్తు సిద్ధాంతమును నమ్మను. ఎందుకనగా దానిని నమ్మినచో పరిశుద్ధాత్మ బోధలను

తృణీకరించుటయే—బైబిలు పరిశుద్ధాత్మ యొక్క సంపూర్ణ నడిపింపుతో వ్రాయబడెను కనుక ఇచ్చట పరిశుద్ధాత్మను నమ్మకపోవుట కాదుగాని పెంతెకొస్తువారు పరిశుద్ధాత్మ చెప్పినది నమ్మకపోవుట నీవు చూడగలవు. నీవు ఒక వాక్యమును విసర్జించినచో నీవు ఆత్మను విసర్జించుచున్నావు. యేసు చెప్పెను: "ఆత్మయే జీవింపచేయుచున్నది; శరీరము కేవలము నిష్ప్రయోజనము. నేను మీతో చెప్పుచున్న మాటలు ఆత్మయు, జీవమునై యున్నవి" (యోహాను 6:63). ఇట్టి సత్యమున్నను, మనుష్యులు బైబిలులోని ఒక వాక్యము తెలియక పోయినను ఒకడు రక్షింపబడునని బోధించుచున్నారు. పరిశుద్ధాత్మను విసర్జించు వారెవరు? "లోపల నాటబడి మీ ఆత్మలను రక్షించుటకు శక్తిగల వాక్యమును సాత్వికముతో అంగీకరించుడి" (యాకోబు 1:21). "సువార్త ప్రకటనయను వెఱ్ఱితనముచేత నమ్ము వారిని రక్షించుట దేవుని దయాపూర్వక సంకల్ప మాయెను" (1 కొరింథి 1:21). పరిశుద్ధాత్మ దిగివచ్చుటవలన రక్షణ పొందుదురని పెంతెకొస్తువారు చెప్పుదురు. నేను పరిశుద్ధాత్మయందు నమ్ముచున్నాను. కాని పరిశుద్ధాత్మచే నూతన నిబంధనయందు పొందుపరచిన సిద్ధాంతములను కాదను పెంతెకొస్తు సిద్ధాంతమును నేను నమ్మను.

ప్రవచనములు నిరర్థకములగునని పరిశుద్ధాత్మ ప్రకటించెను (1 కొరింథి 13:8-9). ప్రవచనములు ఆగిపోయినవని ప్రకటన 22:18 లో వ్రాయబడెను. నేను పరిశుద్ధాత్మ చెప్పువాటిని నమ్ముచున్నాను. కాని పెంతెకొస్తువారు నమ్ముటలేదు. సూచక క్రియలు వాక్యమును స్థిరపరచుచుండెను (మార్కు 16:20; హెబ్రీ 2:1-4). వాక్యము సంపూర్ణముగా యున్నది (2 తిమోతి 3:16, 17). వినుటవలన విశ్వాసము కల్గును (రోమా 10:17). పరిశుద్ధులకు ఒక్కసారే బోధ అప్పగింపబడెను (యూదా 3). ఇవి యన్నియు పరిశుద్ధాత్మ బోధలే. వీటి నన్నిటిని పెంతెకొస్తువారు విసర్జించిరి. కావున వారు పరిశుద్ధాత్మను

విసర్జించిరి. ఆత్మలను పరీక్షించుడి అని యోహాను చెప్పెను (1 యోహాను 4 : 1). మనము ఈ వ్యాసములో పెంతెకొస్తువారి యాత్మను పరీక్షించుచున్నాము, పరిశుద్ధాత్మను కాదు. అది ఆత్మ యొక్క సత్యస్వరూపము (యోహాను 16:13) - ఇది సత్య వాక్యము (యోహాను 17:17). సత్యము సత్యమునకు భిన్నముగా యుండదు గాని పెంతెకొస్తు సిద్ధాంతము వాక్యమునకు వ్యతిరేకముగా యున్నది. వాక్యమును స్థిరపరచుటయే పరిశుద్ధాత్మ గుర్తులు (హెబ్రీ 2:1-4). వాక్యము సంపూర్ణమై యున్నది. కావున ఈ గుర్తులయొక్క ఉద్దేశము ముగిసినది. ఇంకను కొనసాగు గుర్తులు సాతాను సంబంధమైనవే (మత్తయి 7 : 22, 23; 2 థెస్స 1:10-12).

యోహాను ప్రవచించిన పరిశుద్ధాత్మ బాప్తిస్మము (మత్తయి 3:11) అపొస్తలులకు మాత్రమే పరిమితమయినది (అ. కా. 2:1-8) అని యేసు చెప్పెను. యేసు చెప్పినది నేను నమ్ముచున్నాను. పరిశుద్ధాత్మ వరము బాప్తిస్మము పొందిన ప్రతి విశ్వాసికి అనుగ్రహింపబడునని పరిశుద్ధాత్మ చెప్పెను. ఇది నేను నమ్ముచున్నాను కాని ఇది బాప్తిస్మమునకు భేదమైనది (అ.కా. 2:33). ఇచట ఆత్మఫలములు కలవు (గలతీ 5:22-23). యేసు సరియా? లేక పెంతెకొస్తువారు సరియా? నేను యేసును నమ్మెదను.

రోగికి వైద్యుడు అవసరమని యేసు చెప్పెను (మార్కు 2:17). పెంతెకొస్తువారు రోగులకు వైద్య డక్కర లేనట్లు తలంచుచున్నారు. మందులు వాడవద్దని పెంతెకొస్తువారు చెప్పుదురు. పరిశుద్ధాత్మ ప్రేరితుడై పౌలు నీ కడుపు జబ్బు నిమిత్తమును, తరచుగావచ్చు బలహీనత కొరకును ద్రాక్షారసము పుచ్చుకొనుమని చెప్పెను (1 తిమోతి 5:23). విశ్వాసము, నిరీక్షణ, ప్రేమ ఇవి మూడును నిలుచునని పౌలు పరిశుద్ధాత్మవలన చెప్పెను (1 కొరింథి 13:13). అద్భుతములైన వరము లున్నవని పెంతెకొస్తువారు బోధింతురు. పౌలు పరిశుద్ధాత్మ ప్రేరితుడై

చెప్పెను. పెంతెకొస్తువారిని ఏ ఆత్మ కదుపుచున్నది? పరిశుద్ధాత్మ బోధలను పెంతెకొస్తువారు విసర్జించుచున్నట్లు పై విషయములలో చూపించితిమి. గౌరవమైన ప్రతి పురుషునికిని, స్త్రీకిని ఇట్టి మానవ నిర్మితమైన సంస్థలను విడిచి యేసుక్రీస్తను గట్టి బండపై నిలుచుటకును, అన్ని విషయములలోను పరిశుద్ధాత్మచే నడిపించబడుటకును రమ్మని మనవి చేయుచున్నాను.

త్వరలో యేసు మాట్లాడును. అప్పుడు పరలోకరాజ్యము తప్ప సమస్తము గతించును (హెబ్రీ 12:26, 29). మిగత తెగలవలె పెంతెకొస్తువారు కూడ ఇహ సంబంధులే. ఇవి మానవనిర్మితములై మానవులచే నడిపింపబడుచున్నవి. క్రీస్తునందే రక్షణ యున్నది (అ.కా. 4:12). క్రీస్తు శిరస్సుగా గల సంఘమునందు దేవుని మన మందరము ఆరాధించవలసి యున్నది (ఎఫెసీ 4:23-26; 3:21).

—జె. సి. బెయిలీ.

---

From
SATYA WAKKU
P.O. Box. 80
KAKINADA-533 001

Regd. No. H/KD-45/KD.H.O

To
..........
..........
..........
..........